

# బరువు

గన్నంరాజు సుందరరావు

సుబ్బరామయ్య మధ్యాహ్న భోజనం సుష్టుగా కానిచ్చేసి, సావిత్రమ్మ అందించిన తాంబూలం బుగ్గన బిగించేసి అలవాటు ప్రకారం వీధి వరండాలోకి వచ్చేసాడు.

కుడివేపు అరుగుమీద అతనికి విశ్రాంతి నివ్వడానికి వాలుకుర్చీ సిద్ధంగానే వుంది. దాని పక్కన స్టూలుమీద ఆనాటి న్యూస్‌పేపరూ కళ్ళజోడూ, సిగరెట్టుపెట్టె, అగ్గిపెట్టె అతని కోసం ఎదురుచూస్తున్నాయి.

ప్రతిరోజూ ఆ వేళకి అక్కడ అవసరమైనవన్నీ అమర్చిపెట్టే కూతురు సీతని పలువిధాల మెచ్చుకుంటూ, రక

రకాలుగా దీవిస్తూ వెళ్ళి, ఆ వాలుకుర్చీలో శేరువాల్చాడు సుబ్బరామయ్య.

భుక్తాయాసంగా వుంది.

అరుగుకి దగ్గరగా ఇంటిముందున్న గున్నమామిడి చెట్టు ఉండుండి విసురుతున్న చల్లగాలి మేనుకి హాయినీ, మనసుకి ఆహ్లాదాన్నీ కలిగిస్తుంటే అలవోకగా కుడి చేయిని తలకింద పెట్టుకుని కళ్లు మూసుకున్నాడు సుబ్బరామయ్య....

సుబ్బరామయ్యకి ఇప్పుడే చీకూ చింతా లేవు. దిగులు అసలే లేదు. మనసుని చిత్రవధకు గురిచేసే ఆలోచనలూ లేవు. ఒకవేళ అనిపిస్తే వెనక్కి వెళ్లి గతాన్ని స్పృశిస్తే....

చిన్నతనం, ఆనాటి ఆప్తమిత్రులూ, హైస్కూలు చదువూ కాలేజీ జీవితం, ఆ చదువు పూర్తిచేసిన వెంటనే దొరికిన గవర్నమెంటు ఉద్యోగం, సావిత్రితో వివాహం, వరుసగా పుట్టిన ఇద్దరు కొడుకులూ, ముగ్గురు ఆడపిల్లలు, వాళ్ల పెంపకం, చదువులు, మగపిల్లల ఉద్యోగాలు, మొదటి నలుగురు పిల్లల వివాహాలు, సర్వీసులో తన ప్రమోషన్లు, ట్రాన్స్‌ఫర్‌లు, ఆఫీసర్‌గా రిటైరవడం పీడకలగా [illegible]రవై రెండేళ్ల జీవితంలో అప్పుడప్పుడు ఎదురైన విషమపరిస్థితులు, నేర్పుగా పరిష్కరించుకున్న కఠిన సమస్యలు కష్టాలు సుఖాలు, అష్టకష్టాలు పడి కట్టుకున్న డాబాయిల్లు ముఖ్యంగా గుర్తొస్తుంటాయి.

రిటైరయేవరకూ గడిచిన జీవితం, తత్సంబంధమైన జ్ఞాపకాలు మదిలో మెదిలినా చెప్పుకోదగ్గ మనక్షోభ కలగదు సుబ్బరామయ్యకి.

కాని___

రిటైరయిన దగ్గర్నుంచి- అంతకు ముందే ఎదిగి కూర్చున్న కనిష్టపుత్రిక సీత-పలువురుమెచ్చిన అందం, అణకువ, చదువూ గుణం లాంటి అర్హతలన్నీ వుండి కూడా అవివాహితగా మిగిలిపోయిన సీత- ఏ సందర్భంలోనైనా గుర్తొచ్చినప్పుడూ, పెళ్లికావడం లేదన్న దిగులుని అంతరంగం అట్టడుగు పొరలో సమాధిచేసి పైకి నిశ్చింతగా రోజులు దొర్లించేస్తున్న సీత కంటబడినప్పుడూ, గుండెని ఎవరో కత్తులతో కోస్తున్నట్టని పించేది సుబ్బరామయ్యకి.

ష్టకష్టాలుపడి వెతికి తెచ్చిన సంబంధాలు సీతని చూసి ముచ్చటపడి కట్నంకానుకల దగ్గర అసంతృప్తిని వెల్లడించి విరిగిపోతుండడంవల్ల రాను రాను సీతపెళ్లి- అనేది ఓ భయంకర సమస్యగా పరిణమించి మనసుని అల్లకల్లోలం చేసేస్తుండేది. రెండునెలల క్రితం వరకూ ఆ విషయంలో సుబ్బరామయ్య చింతించని క్షణంలేదు.

రెండు నెలల కిందట అనుకోకుండా ఆ సంబంధం రావడం, అది అన్ని విధాల

యోగ్యంగా, అనుకూలంగా వుండడం, సీత పెళ్ళి నిశ్చయమైపోవడం క్షణాల మీద జరిగిపోయాయి. అదంతా జరిగిన ఉత్తరక్షణంలోనే తలమీద పాతుకు పోయిన కొండంత బరువులో తొంభై వంతులు దిగిపోయినట్టనిపించింది సుబ్బరామయ్యకి

పెళ్ళికొడుకు తండ్రి ముందుగా ఇమ్మంటూ అడిగిన కట్నండబ్బు ఇచ్చేసి, నిశ్చయతాంబూలాల కార్యక్రమం అయాక వైశాఖమాసంలో వాళ్ళు కోరుకున్న ముహూర్తానికి శుభకార్యం నిర్విఘ్నంగా జరిగిపోతే మిగతా పదివంతుల బరువూ దిగిపోతుంది నిద్రాహారాలు సంతృప్తికరంగా లేకుండా చేసి, అహరహం కాల్చుకుతిన్న ఆ భయంకర సమస్యకి చక్కని పరిష్కారమార్గం, లభించటం ఇంక కొద్ది నెల్లోనే అయినా, బాధ్యా బరువు బాధ్యతలులేని ప్రశాంత జీవితం గడపొచ్చనే ఆలోచన అనుక్షణం మదిలో మెదలుతుండటంవల్ల సుబ్బరామయ్యకి ప్రతిక్షణం హుషారుగా, ఉత్సాహంగా గడుస్తోందిప్పుడు....

సిగరెట్టు మీదికి ధ్యాసపోతుంటే కళ్ళు తెరిచాడు సుబ్బరామయ్య

సిగరెట్టు వెలిగించి గుండెలనిండుగా దమ్ములాగి పరవశించి, పొగ బయటకు వదిలాడు. రెండో దమ్ము లాగేలోపల ఇంటిముందు టాక్సీ ఆగిన చప్పుడైంది. సుబ్బరామయ్య చూపులు అటుతిరిగాయి.

గేటుతీసుకుని చేతిలో బ్రీఫ్‌కేస్‌తో లోపలకొస్తున్న వ్యక్తిని చూడగానే సుబ్బరామయ్య మొహం ఒక్కసారిగా వెలిగింది కళ్ళు మెరిశాయి. చంగున కుర్చీలోనుంచి లేచి సిగరెట్టు ఆర్పేసి స్టూలుమీద పడేసి అవధులు మీరిన ఆనందాశ్చర్యాలతో శరీరం కంపించిపోతూంటే వరండా అంచువరకూ వెళ్ళి; మెట్లుదిగి వెళ్ళాలన్నది మరచి—

"ఒరే.... ఓరే.... నువ్వు.... ఒరే సుందూ... ఇది కలా? నిజమా? నువ్వు నిజంగా నా సుందూగాడివేనా?" అంటాడు సుబ్బరామయ్య రెండు చేతులూ ముందుకు చాచి ఆహ్వానిస్తూ.

"ఆఁ.... నేనేరా సుబ్బూ...." ఆనందంగా అంటూ మెట్లెక్కివచ్చి సుబ్బరామయ్యని బాహువుల్లో బంధించాడు సుందరరామయ్య. మిత్రులిద్దరూ కొన్ని క్షణాలు గాఢ పరిష్వంగంలో మైమరచి విడివడి— ఒకరిభుజాలొకరు పట్టుకున్నారు ఆప్యాయంగా. ఇద్దరి వదనాల్లోనూ పెన్నిధి దొరికినంత సంబరం. నాలుగు కళ్ళలో పొంగిపొరలుతున్న అభిమానం.

"ఎన్నాళ్ళయిందిరా నిన్ను చూసి!" అన్నాడు సుందరరామయ్య ఆనందంతో ఉక్కిరిబిక్కిరవుతూ.

"ఎన్నాళ్ళేమిటి? ఎన్నో ఏళ్ళు దొర్లిపోయాయి" అన్నాడు సుబ్బరామయ్య కళ్ళు చెమ్మగిల్లుతుండగా. వీళ్ళమాటలు లోపలికి వినిపించాయి. వంటగది సర్దు

తున్న సావిత్రమ్మ 'ఎవరో వచ్చారు' అనుకుంటూ వీధిగుమ్మంలోకొచ్చి, సుందరరామయ్యని చూసి చటుక్కున పైటకొంగు భుజంచుట్టూ తిప్పుకుని నిండుగా కప్పుకుంది.

గాజులసవ్వడి విని వెనక్కి తిరిగాడు సుందరరామయ్య.

"వచ్చావా సావిత్రీ... ఇదుగో వీడు, సుందూగాడు. సారీ.... సుందరరామయ్య. నా చిన్ననాటి స్నేహితుడు" భార్యకి పరిచయంచేశాడు.

సావిత్రమ్మ నమస్కరించింది సగౌరవంగా.

ప్రతినమస్కారం చేశాడు సుందరరామయ్య, సావిత్రమ్మవేపు అభిమానంగా చూస్తూ సన్నగా నవ్వుతూ "మేం ఇద్దరం ఒకటోక్లాసునుంచీ ఎంకాం వరకూ కలిసే చదువుకున్నాం. మా స్నేహం అలాంటిలాంటిదికాదు. అరమరికలు లేని ప్రాణ స్నేహం. మమ్మల్ని చూసి మిగిలినవాళ్లు ఈర్ష్యపడేవారు" అన్నాడు ఆనందంగా గర్వంగా సుబ్బరామయ్య.

సావిత్రమ్మ నవ్వింది ముసిముసిగా.

"అన్నయ్య నిలా ఇక్కడే నిలబెట్టేశారు.... లోపలికి తీసుకురావడం అదీ వుందా లేదా" అంది మృదువుగా. సుబ్బరామయ్య నవ్వి "ఏదీ ఇప్పుడేగా వీడొచ్చింది.... వీణ్ని చూడగానే నన్ను నేను మరచిపోయి ఇలా నిలబెట్టేశాను" సావిత్రమ్మతో అని "రారా సుందూ.... రా... " ఆదరంగా సుందరరామయ్య భుజంమీద చేయ్యేసి హాల్లోకి తీసుకెళ్లి సోఫాలో కూర్చోబెట్టి పక్కనే తను కూర్చుంటూ "ఇదుగో సావిత్రీ పది నిముషాల్లో వంటయిపోవాలి, క్విక్...." అన్నాడు చిటికెలువేస్తూ.

"అలాగే" అంటూ సావిత్రమ్మ వెళ్లబోతూంటే_


"ఇదుగో అమ్మాయ్. వీడి మాట విని నువ్విప్పుడేం శ్రమపడకు. ట్రెయిన్ దిగ్గానే హోటల్లో భోజనం ముగించి టాక్సీ ఎక్కాను. చల్లని మంచినీళ్ళు తప్ప నా కిప్పుడేం వద్దు. వద్దుగాక వద్దు" అన్నాడు సుందరరామయ్య_ రుమాలుతో మొహం తుడుచుకుంటూ.

సావిత్రమ్మ నిలబడిపోయింది నిస్సహాయంగా.

"చూడు సావిత్రీ. వాడి మాట వినకు. మొహమాటపడిపోతున్నాడు. హోటల్లో తినేశాడని దబాయించేస్తున్నాడు. తిన్నా తినకపోయినా ఇప్పుడు వీడు ఎంగిలిపడాల్సిందే_ వెళ్లు త్వరగా కానీ" అరిచాడు సుబ్బరామయ్య.

"నా తరం కాదురా బాబూ. మంచినీళ్లు తప్ప ఇప్పుడు మరేం ముట్టను. నన్ను ఇబ్బంది పెట్టకు... " బతిమాలాడు సుందరరామయ్య - సుబ్బరామయ్య చేతులు పట్టుకుని.

సావిత్రమ్మ భర్త మొహంలోకి




చూసింది. ఏం చెయ్యమన్నా రన్నట్లు. అతని సంజ్ఞ అందుకుని ఫేన్ స్విచ్ వేసి వెళ్లింది లోపలికి.

"అదేమిట్రా నాతరాక వచ్చి ఇలా చేశావు? నాకేం నచ్చలేదు నీ వ్యవహారం. నా మనసు బాధపడుతుంది. మరచిపోయి వట్టున్నావు." అన్నాడు బాధగా.

పకపక నవ్వేశాడు కళతగ్గిన సుబ్బరామయ్య మొహంవేపు చూస్తూ సుందరామయ్య. నవ్వాపుకుని "ఒరే సుబ్బా నువ్వనవసరంగా బాధపడకు. ఆకలి దంచేస్తూంటే తట్టుకోలేక కక్కుర్తి పడ్డాను. రాత్రి ఇద్దరం కలిసి కమ్మగా కబుర్లు చెప్పుకుంటూ కూర్చుని హాయిగా తిందాం. మా చెల్లికి చెప్పి బ్రహ్మాండమైన విందుభోజనం ఏర్పాటుచేయించు. గొంతువరకూ తినేస్తాను." అన్నాడు మిత్రుడి చెయ్యి అందుకుని ఆప్యాయంగా నొక్కుతూ.

సుబ్బరామయ్య మరేం అనలేకపోయాడు.

మరచెంబుతో మంచినీళ్లూ గ్లాసూ, గాజుగ్లాసులో మజ్జిగ తెచ్చి టీపాయ్ మీద పెట్టింది సీత.

"ఎవరు?" అన్నట్లు చూశాడు సుందరరామయ్య.

"మా అమ్మాయి. నా కష్టపుత్రిక సీత" అన్నాడు సుబ్బరామయ్య కూతురు వేపు అభిమానంగా చూస్తూ. సీత నమస్కరించింది సవినయంగా.

ముగ్ధమనోహరంగా వున్న సీతవేపు ఆదరంగా చూస్తూ "కల్యాణమస్తు"

ఆశీర్వదించాడు సుబ్బరామయ్య హృదయపూర్వకంగా.

సీతకళ్లు సిగ్గుతో వాలిపోయాయి. తల వొంచుకొని అక్కడనుంచి నిష్క్రమించింది.

"అమ్మాయి సాక్షాత్తు సీతామహాలక్ష్మిలావుందిరా. మా గీతకూడా అచ్చం ఇలాగే వుంటుంది" అన్నాడు సుందరరామయ్య వెళుతున్న సీతవేపు చూస్తూ.

సుబ్బరామయ్య సన్నగా నవ్వి "అన్నట్టు నీ వివరాలు అడగడమే మరిచిపోయాను. ఇప్పుడు నువ్వెక్కడ ఉంటున్నావు? ఇక్కడికెలా వచ్చావు? మా చెల్లి — పిల్లలూ [illegible] అడిగాడు.

ముందు మజ్జిగ, తరవాత మంచినీళ్లూ తాగి [illegible] మాలుతో మూతి తుడుచుకుని "ప్రస్తుతం నేనూ మీ చెల్లెలూ బాల్యం, నాగపూర్‌లో మా పెద్దబ్బాయి దగ్గర వుంటున్నాం. నాకు ముగ్గురు కొడుకులు, ఇద్దరు కూతుళ్లు. కొడుకులకీ, పెద్దమ్మాయికీ పెళ్లిళ్లయిపోయాయి. వాళ్ల బతుకులు చెప్పుకోదగ్గ ఉన్నత స్థితిలోనే గడుస్తున్నాయి. రెండో అమ్మాయి గీత పెళ్లికి ఎదిగిపోయి ఎనిమిదేళ్లయిపో వస్తోంది. సంబంధాలేవో వస్తున్నాయి గాని కుదరడంలేదు. ఇక్కడ భీమవరంలో ఏదో సంబంధం వుందని తెలిసి వచ్చాను. అక్కడే కనిపించాడు మన వెంకట్రామయ్య. వాణ్ని అడిగితే నువ్విక్కడుంటున్నావని అడ్రసిచ్చాడు. నీ అడ్రసు దొరికేక నిన్ను చూడకుండా ఇంటికెళ్లా లనిపించలేదు. వచ్చేశాను" అన్నాడు సుందరరామయ్య మిత్రుడి మొహంలోకి అభిమానంగా చూస్తూ.

ఆ మాటలు వింటూనే పొంగిపోయాడు సుబ్బరామయ్య.

"మంచిపని చేశావురా అబ్బాయ్. నిజంగా నాకు చాలా ఆనందంగా వుంది. అదృష్టం వుండబట్టి ఇన్నేళ్ల తరవాత ఇలా అనుకోకుండా మనం కలుసుకోగలిగాం. ఉద్యోగాల నిమిత్తం ఆరోజుల్లో నువ్వు బెంగుళూరు, నేను ఢిల్లీ వెళ్లిపోయాం. తదనంతరం ఉత్తరాలద్వారా ఒకరిగురించి ఒకరు తెల్సుకున్నాం. తరవాత బదిలీలమీద నేను దేశమంతా తిరిగాను. ఢిల్లీ నుంచి బొంబాయి వెళ్లాక నేను బెంగుళూరికి రెండుమూడు ఉత్తరాలు రాశా.. ఏ ఒక్కదానికీ నీ దగ్గర్నుంచి జవాబు లేదు. అంతే అవి కూడా ఆగిపోయాయి. అప్పుడలా విడిపోయి ఈ సుదినాన కలుసుకున్నాం. వెంకట్రామయ్యగారు రెండేళ్ల కిందట విశాఖలో కలిశాడు. భీమవరంలో వుంటున్నట్టు చెప్పాడు. నేను ఇప్పటికి నాలుగైదుసార్లు వెళ్లాను వాడిదగ్గరికి. వాడూ వస్తూంటాడు ఇక్కడికి. ఇద్దరం కల్సినప్పుడు నీ గురించికూడా అనుకుంటూంటాం. ఇంక ఫరవాలేదు. తరచూ మనం కలుసుకోలేకపోయినా కనీసం ఉత్తర ప్రత్యుత్తరాలైనా జరుగుతాయి మన



మధ్య....ఏమంటావ్...." మిత్రుడివేపు చూశాడు సుబ్బరామయ్య.

"తప్పకుండా... వీలయితే తరచూ రాకపోకలుగూడా జరుపుకుందాం. నాగపూర్‌లో ఉండడం నా కిష్టంగాలేదు. ఈ గోదావరిజిల్లాలో ఏదో వూళ్లో ఓ యిల్లు కొనుక్కొని స్థిరపడాలని అనుకుంటున్నాం నేనూ, రాజ్యం. నువ్విక్కడున్నావు కాబట్టి ఇక్కడే కొనుక్కుంటే బాగుంటుందని ఇప్పు డనిపిస్తోంది." అన్నాడు సుందరరామయ్య సన్నగా నవ్వుతూ.

సుబ్బరామయ్య కళ్లు మెరిశాయి. ఆప్యాయంగా సుందరరామయ్య భుజం మీద చెయ్యేసి "చాలా సంతోషం. అలాగయితే మన చరమ జీవితాలు ఆనందంగా గడుస్తాయి. నువ్వు మరే వూళ్లోనూ స్థిరపడ్డానికి ప్రయత్నించకు.

ఈ వూళ్లో రెండుమూడిళ్లు అమ్మకాని కున్నాయి. వాటిలో నీకూ నీ భార్యకూ నచ్చిన ఇల్లు కొనేద్దాం. కాస్త రిపేర్ చేయించుకుంటే దివ్యంగా వుంటుంది. సాధ్యమైనంత త్వరలో ఈ పని జరిగి పోవాలి. ఆలస్యమైతే ఆ యిల్లు అమ్ముడై పోవచ్చు.... అది సరేగానీ ఇంతకూ నువ్వు భీమవరం వెళ్ళిన పని సవ్యంగా జరిగినట్టేనా? సంబంధం అనుకూలమైన దేనా? కట్నం కానుకలు — ఎంతలో వున్నారు వాళ్ళు" అడిగాడు కుతూహలంగా.

"సంబంధం అనుకూలంగానే వుంది సాంప్రదాయం, పరువు ప్రతిష్టలున్న కుటుంబం. అ కుర్రాడు ఇంజనీర్. ఆర్జన గొప్పగానే వుంది. మంచివాడనే పేరుంది. అంతా బాగానే వుందిగాని కట్నం లాంఛనాలూ నలభై వేలు కావాలిట. పైసా అయినా తగ్గించడట. నేననుకున్న దానికంటే పదిహేనువే లెక్కువ. పెళ్ళిఖర్చులు భరించి నలభై వేలు వాళ్ళకే పోసేస్తే ఇంక నే నెలా బతకాలి అని పిస్తోంది. కొడుకులమీద ఆధారపడి బత కడం నాకు నచ్చదు. వాళ్ళకి అభిమానం వుంటే ఆదరిస్తారు లేకపోతే ఏదో అనేస్తారు. మన మనసులు గాయపడతాయి. ఇదంతా ఎందుకు సాధ్యమైనంతవరకు స్వతంత్రంగా బతకడం శ్రేయస్కరం. అందుకే మేం ఇద్దరం వేరేగా ఎక్కడైనా హాయిగా చివరిదశ వెళ్ళబుచ్చాలని ఆరాటపడుతున్నాం. ఇప్పు డీ పదిహేను వేలూ ఖర్చవకుండావుంటే మేం కాస్త యినా సుఖపడొచ్చుకదా. ఈ సాధకబాధ కాలు అవతలవాళ్లకి అక్కర్లేదు ఇవతల వాళ్ల కష్టసుఖాల గురించి వాళ్లు ఆలో చించరు. వాళ్లకి కావలసింది కట్నం. వేలకివేలు. అంతే ....బరువు దించుకోవాలంటే ఈ అవస్థలు పడక తప్పదురా అబ్బాయ్. ఆడపిల్లల్ని కన్నందుకు ఈ కఠినశిక్ష అనుభవించాల్సిందే. ఏదో విధంగా చచ్చిచెడీ చివరికి సర్వనాశనం అయిపోయైనాసరే బరువు దించేసుకోవాలి. లేకపోతే పరువు దక్కదు. బతుకు నిశ్చలంగా గడవదు" ఒట్టూర్చాడు బాధగా సుందరరామయ్య.

సుబ్బరామయ్య మనసు గిలగిలలాడింది. భారంగా నిట్టూర్చి "నువు చెప్పినట్టు ఓ విధంగా ఇది కఠినశిక్షే. ఆడపిల్లల్ని కన్న నేరానికి విధించబడుతున్న జరిమానా అన్నమాట ఈ కట్నం. నేరం చేసినవాళ్లు విధించబడిన జరిమానా చెల్లించక తప్పదు... ఏం చేస్తాం భరించాల్సిందే ..సంబంధం వచ్చినప్పుడూ పిల్ల సుఖపడుతుందని ఊహించినప్పుడూ తాహతుంటే వాళ్లడిగినదంతా పారెయ్యడం శ్రేయస్కరం. ఏమాత్రం తక్కువ చేసినా పిల్లని కౄరమృగాల్లా పీక్కుతినేస్తారు. పెళ్లామనే అభిమానం కట్టుకున్న వాడికీ వుండదు. అడిగినవి దక్కకపోతే వాడూ కాల్చుకుతింటాడు. ఒకవేళ వాడు

మంచిగా వున్నా వాడితరపు బంధువులు వుండనివ్వరు. రాబందుల్లా పొడిచిపొడిచి మనసు విరిచేస్తారు. ఇదీ ఇప్పటి దుర్భర పరిస్థితి. ఏదోలాగ మన బతుకులు ఇంత వరకూ ఈడ్చుకొచ్చాం. ఇంక మనం ఎన్ని కష్టాలుపడినా, నువ్వన్నట్టు సర్వ నాశనం అయిపోయినా కన్నపిల్లలు అందులోనూ ఆడపిల్లలు సుఖంగా బతకడానికి తగిన ఏర్పాట్లు చేసేస్తే మనకి శాంతిగా ఉంటుంది. అంచేత ఈ విషయంలో అట్టే బాధపడకు. తగ్గించమని బేరాలాడకుండా వాళ్ళడిగిన కట్నం ఇచ్చేసి పెళ్లి జరిపించేసెయ్...." అన్నాడు సుబ్బరామయ్య అనునయంగా. సుందరరామయ్య తలవూపాడు సాలోచనగా.

ఆ తరవాత మిత్రులిద్దరూ ఆ విషయం గురించి ప్రస్తావించలేదు. సంభాషణ మళ్లించుకుని చిన్ననాటికబుర్లు కలబోసుకున్నారు. కాలేజీజీవితం — ఉద్యోగాలు, తమ పెళ్లిళ్లు, సర్వీసులో ప్రమోషన్లు ట్రాన్స్‌ఫర్లు— పిల్లలు చదువులు, వాళ్ల ఉద్యోగాలు వీటిగురించి చాలా సేపు మాట్లాడుకున్నారు. ఒకవల అల్లర్ల గురించీ ఆటపాటలగురించీ ముచ్చటించుకున్నారు. ఆ మాటల్లోనే తాము పడిన కష్టాలు, ప్రస్తుతం ఎదుర్కొంటున్న దుర్భరపరిస్థితులు ఏకరువుపెట్టాడు సుందరరామయ్య. అలా ఆప్తమిత్రుడితో దాపరికం లేకుండా అన్నీ చెప్పుకోవడం వల్ల అతని హృదయభారం కాస్త తగ్గింది.

సుందరరామయ్య చెప్పుకున్నదంతా విన్నాక మనసు బరువెక్కింది సుబ్బరామయ్యకి. జాలిగా, అభిమానంగా చూస్తూ "బాధపడకురా— ఇటుపైన నీకే ఇబ్బందీ కలగకుండా నే జూసుకుంటాను. పిల్లపెళ్లి కాస్తా అయిందనిపించేసి నువ్వా చెల్లీ ఈ వూరొచ్చెయ్యండి. ఇల్లు కొనుక్కునే వరకు మా యింట్లో వుందురుగాని. మరో కుటుంబం హాయిగా ఏ అసౌకర్యం కలగకుండా మసలడానికి అనువుగానే కట్టించాను ఈ కొంప. అంచేత మరో ఆలోచన పెట్టుకోకు— మొహమాటం అసలు పడకు." అన్నాడు సుబ్బరామయ్య ఆదరంగా.

ఆ మాటల్లో ఉట్టిపడుతున్న అభిమానానికి కరిగిపోతూ "నువ్వు కోరినట్టు అక్షరాలా జరిగితే అదృష్టవంతుణ్నే. కాని జరగాలి గదా. ఇక్కడెక్కడో స్థిరపడాలని అనుకుంటున్నాం గాని ఇంకా ఓ నిర్ణయానికి రాలేదు. అందుకు కొన్ని పరిస్థితులు, సమస్యలు అడ్డొస్తున్నాయి. అన్నీ సానుకూలమై అబ్బాయిలు అంగీకరిస్తే తప్పకుండా వచ్చేస్తాం. నీలాంటి ఆప్తమిత్రుడూ, ప్రాణంపెట్టే మనిషీ ఆదరంగా ఆహ్వానిస్తుంటే రాకపోవడం అవివేకం. ఈ రోజుల్లో ఇలాంటి అండ దొరకడం అదృష్టం" అన్నాడు సుందరరామయ్య జీరబోయిన కంఠంతో.

"ఒరే...ఒరే...నువ్వు అతిశయోక్తులు పలికేస్తున్నావు. నన్నవసరంగా ఆకాశానికెత్తేస్తున్నావు" అరిచాడు సుబ్బరామయ్య నవ్వుతూ.

"అదేం కాదు. నిఖార్సయిన నిజం చెబుతున్నాను. నీ ఆదరణ, ఆప్యాయతలు, చల్లని మాటలు నాకెంతో ధైర్యాన్నిస్తున్నాయి. ఏదో కొత్త ఉత్సాహం పుట్టుకొస్తోంది" అన్నాడు సుందరరామయ్య, అభిమానంగా సుబ్బరామయ్య నుపంచుకుంటూ చెయ్యివేసి.

సుబ్బరామయ్య నివ్వాడు నిశ్శబ్దంగా. నవ్వి "అది సరేగాని ఇల్లు చూద్దూగాని పద. చాలా అవస్థలు పడి నిర్మించుకున్న పీడ ఇది. నీ క్కూడా నచ్చితే నాకు ఆనందంగా వుంటుంది" అంటూ లేచాడు.

సుబ్బరామయ్య ముందు నడుస్తూంటే అతన్ని అనుసరిస్తూ ఇల్లంతా చూసి సంబరపడ్డాడు సుందరరామయ్య. తరవాత స్నానానికని వెళ్ళి పెరట్లో పూలమొక్కలు, కూరగాయల పాదులు, అంటుమామిడి చెట్లు చూసి ముచ్చటపడ్డాడు. సుందరరామయ్య స్నానం అదీ అయాక ఇద్దరూ హాల్లోకొచ్చి సోఫాలో ఆశీనులయారు మళ్ళీ.

వేడివేడి పకోడీలు, మైసూర్‌పాక్ రెండు ప్లేట్లలో తెచ్చి టీపాయ్‌మీద పెట్టింది సీత. టిఫిన్ కాఫీలూ అయాక టైం చూసుకున్నాడు సుందరరామయ్య.

"నాలుగు దాటిందిరా. ఓసారలా వెళ్ళి బజారు చూసి రావాలని వుంది. నువ్వు రాగలవా" అడిగాడు.


"వెళ్దాం. రోజూ అయిదుదాటాక బజారు కెళ్ళి కూరగాయలు తెచ్చుకోవడం నా అలవాటు. నువ్వు కాసేపు విశ్రాంతిగా కూర్చో. ఈలోగా నేను తయారై వస్తాను." అంటూ లేచివెళ్ళి, ఇంచుమించు పదినిముషాలు గడిచాక చేతిలో సంచీతో తిరిగొచ్చి "పదరా సుందూ వెళదాం" అంటూ బయలుదేరాడు సుబ్బరామయ్య.

ఏవేవో మాట్లాడుకుంటూ వెళ్ళి ఓ గంటసేపు తిరిగి బజారంతా చూశాక, తనూ ఓ పెద్దసైజు గుడ్డసంచీ కొని, వద్దువద్దని సుబ్బరామయ్య అడ్డుపడుతున్నా వినిపించుకోకుండా పువ్వులూ పళ్లూ స్వీట్లూ సంచీనిండా కొనేసాడు సుందరరామయ్య. రకరకాల కూరగాయలు కొనేసి సుబ్బరామయ్య తెచ్చిన సంచీ కూడా నింపేశాడు.

అట్నుంచి రిక్షాలో తిరిగొచ్చి సంచులు ఇంట్లో పడేసి ఇద్దరూ సినిమాకని బయలుదేరారు

"అమ్మాయిని తీసుకుని నువ్వుకూడా రావమ్మా, అందరం సరదాగా వెళ్దాం" అన్నాడు సుందరరామయ్య సావిత్రమ్మనుద్దేశించి.

"వంట మొదలెట్టేశా నన్నయ్యా. మీ యిద్దరూ వెళ్ళరండి" అంది సగౌరవంగా సాగనంపుతూ సావిత్రమ్మ.




సినిమానుంచి తిరిగొచ్చి భోజనాలకి కూర్చున్నారు. సావిత్రమ్మ ఆదరంగా వడ్డన చేస్తూంటే- సరదాగా కబుర్లు చెబుతూ, రుచుల్ని మెచ్చుకుంటూ సావిత్రమ్మని పొగుడుతూ తృప్తిగా, పుష్టిగా భోజనం ముగించారు సుబ్బరామయ్యతో బాటుగా సుందరరామయ్య కూ.

తండ్రికీ- సుందరరామయ్యకీ హాల్లో పక్కలు సిద్ధంచేసింది సీత. పళ్లెంలో పళ్లూ, కిళ్లీలూ అమర్చి రెండు మంచాలకీ మధ్య స్టూలుమీద పెట్టింది. మర చెంబుతో మంచినీళ్లూ రెండు గ్లాసులూ తెచ్చి స్టూలుకింద పెట్టింది. భోజనాలయ్యాక హాల్లోకొచ్చి పక్కలమీద కూర్చుని పళ్లుతిని కిళ్లీలు బిగించి- ఆధ్యాత్మిక విషయాలు, తాను దర్శించిన తీర్థ స్థలాలూ, చూసిన ప్రదేశాలు, వింతలు విడ్డూరాలు వీటి గురించి పదకొండున్నర దాటేవరకూ మాట్లాడుకున్నారు. తరువాత మంచినీళ్లు తాగి మేనులు వాల్చారు. ఓ సారి పక్కమీద అటూ ఇటూ దొర్లి వెల్లకిలా పడుకుని పైన నెమ్మదిగా తిరుగుతున్న ఫేన్ వేపు చూస్తూ "అబ్బాయికి సంబంధాలేమైనా వస్తున్నాయా? లేక మేనరికాల్లాంటి వేమైనా ఉన్నాయా" అడిగాడు సుందరరామయ్య కుతూహలంగా. "మేనరికాలేం లేవు. సంబంధాలింతవరకూ చాలానే వచ్చాయి గాని బేరం కుదరలేదు. అయితే ఈ మధ్య ఓ పెద్దమనిషి ద్వారా విజయనగరం నుంచి ఓ సంబంధం వచ్చింది. జానకిరామయ్య గారని- ఆ వూళ్లో పేరుమోసిన లాయరు. ఆయన కొడుకూ లాయరే. ఆ అబ్బాయి ప్రాక్టీసు కూడా బాగానే వుంది. ఆ కొడుకూ వాడికన్న పెద్దది కూతురూ. యిద్దరే ఆ యింటి సంతానం. ఆస్తి

చెప్పుకోదగినదిగానే వుంది. అది మాత్రం కొడుక్కి, కూతురికీ చెరిసగం అంటున్నారాయన. అదంత పట్టించుకో వలసిన విషయం కాదుగాని కట్నం ఇరవై వేలడిగారు. అంత వుండీకూడా కట్నం అడగడం బాధాకరంగానే వుంది. అయినా ఏం చేస్తాం. తప్పదు మరి. నా దగ్గర పదివేలవరకూ వుంది. మిగతా డబ్బు మా అబ్బాయి లిస్తామన్నారు. పెళ్ళిఖర్చుల భారం కూడా వాళ్లదే. వాళ్లిద్దరూ ఆ పదివేలు ఇచ్చాక విజయ నగరం వెళ్లి కట్నండబ్బు ఇచ్చేస్తాను. వచ్చే వైశాఖంలో ఆ శుభకార్యం కాస్తా అయిపోతుంది" చెప్పాడు సుబ్బరామయ్య ఏవేవో ఊహల్లో తేలిపోతూ. "అంతా సిద్ధంగానే వుందన్నమాట. చాలా సంతోషం. పిల్ల పెళ్లి కాస్తా అయిపోతే నీకు నిశ్చింతగా వుంటుంది" ఆవలిస్తూ మగతలోకి జారిపోతూ అన్నాడు సుందరరామయ్య.

"కాదా మరి. ఈ బరువు దిగిపోతే ఇంక నాకే చింతా వుండదు. హాయిగా బతకొచ్చు" నవ్వుతూ మిత్రుడివైపు చూశాడు సుబ్బరామయ్య. కాని అప్పటికే సుందరరామయ్య నిద్రలోకి జారి గురక ప్రారంభించాడు.

సుబ్బరామయ్య కళ్లు మూసుకుని దైవాన్ని ధ్యానిస్తూ నిద్రపోయాడు...

సుబ్బరామయ్య దంపతుల బలవంతం మీద మర్నాటిరాత్రి భోజనం అయేవరకూ వుండిపోయాడు సుందరరామయ్య. మర్నాటి రాత్రి భోజనాలయాక స్టేషన్‌కి తనూ వెళ్లి, మిత్రున్ని ట్రెయిన్ ఎక్కించాడు సుబ్బరామయ్య. బండి కదులుతూంటే కళ్లు చెమ్మగిల్లాయి అత నికి. "క్షేమంగా చేరగానే లెటర్ రాయి. చెల్లినీ పిల్లల్నీ అడిగానని చెప్పు" అన్నాడు ట్రయిన్‌తోబాటు నడుస్తూ జీర బోయిన కంఠంతో.

"అలాగే" అన్నాడు సుందరరామయ్య సుబ్బరామయ్య చెయ్యి మృదువుగా స్పృశిస్తూ.

ట్రెయిన్ వేగాన్ని పుంజుకున్నాక దిగులు మొహంతో నిలబడిపోయాడు సుబ్బరామయ్య. ఏదో వెలితి ఏర్పడింది అతని మనసులో- హఠాత్తుగా ఏదో మధురస్వప్నంలోంచి వాస్తవంలో కొచ్చి నట్టనిపించింది. ఏదో వ్యధ, అశాంతి ప్రబలి ఆప్తమిత్రుని మీద విపరీతమైన అభిమానం పొంగిపొరలింది. రుమాలుతో కళ్లూ మొహం తుడుచుకుని 'సీత పెళ్లికి నెలరోజులు ముందుగా వీణ్నీ వీడి భార్యనీ గీతనీ పిలుచుకురావాలి' అను కున్నాడు, క్షణక్షణానికీ దూరమవుతున్న ట్రెయిన్ వెనుక ఎర్రదీపం వేపు తదేకంగా చూస్తూ.

చైత్రమాసపు తొలిరోజుల్లో సుబ్బ రామయ్య కొడుకులిద్దరూ చెరి అయిదు

వేలూ తెచ్చియిచ్చారు. కట్నం డబ్బు మొత్తం ఇరవై వేలూ పట్టుకుని విజయనగరం వెళ్లి జానకిరామయ్య కివ్వబోయాడు సుబ్బరామయ్య.

"బావగారు క్షమించాలి" అన్నాడు జానకిరామయ్య వెలవెలబోతూ.

"ఎందుకూ!!?" ఆశ్చర్యంగా అనుమానంగా చూశాడు సుబ్బరామయ్య.

"మా అబ్బాయి పెళ్లయిపోయింది మాఘమాసంలో .... సుందరరామయ్య గారనీ, నాగపూర్ వాస్తవ్యులు. వారమ్మాయి గీతని మా కోడలుగా చేసుకున్నాం. కట్నం ముప్ఫయి వేలిస్తామంటూ ప్రాధేయపడితే కాదనలేకపోయాం. మీరుమరోలా భావించక మన్నించండి.." జానకిరామయ్య మాట్లాడుతూనే వున్నాడు అనునయంగా.

సుబ్బరామయ్య కేం వినిపించడం లేదు. తల తిరిగిపోతోంది. కళ్లు చీకట్లు కమ్ముతున్నాయి. నరనరాల్లో విపరీతమైన నీరసమావహించింది.

కొన్ని క్షణాలు గడిచాక భారంగా నిట్టూర్చి వొణుకుతున్న శరీరాన్ని అదుపులో పెట్టుకుంటూ నీరసంగా లేచి ఆ యింట్లోంచి బయటపడ్డాడు.

ఆప్తమిత్రుడై వుండీ కూడా అంతటి ద్రోహం చేసిన సుందరరామయ్యని నిందించలేకపోయాడు సుబ్బరామయ్య. ఇద్దరి మధ్య గల మధురమైన స్నేహబంధం దూషించనివ్వలేదు. అతనికి సుందరరామయ్య మీద గల ప్రేమాభిమానాలు అసహ్యించుకోనివ్వలేదు. 'వాణ్ని నిందించడం, దూషించడం, అసహ్యించుకోవడం అవివేకం. అనవసరం. నేరం వాడిది కాదు. ప్రస్తుత పరిస్థితులది. ఆడపిల్లల తల్లిదండ్రుల్ని పీడిస్తున్న కట్నపిశాచానిది. అది ఎంతటి ఘాతుకాన్నైనా చేయిస్తుంది. ప్రాణ స్నేహాలు బంధుత్వాలు అడ్డురావ్.... ప్చ్.... తను మళ్లీ సంబంధాలు వెతుక్కోవాలి. సాధ్యమైనంత త్వరలో తలమీద బరువు దించుకోవాలి' అలా అనుకుంటూంటే దిగిపోయిందనుకున్న తొంభై వంతుల బరువూ ఆ క్షణంలో ఇంతై, అంతై, ఎంతో పెరిగి వెండి కొండంతై మళ్లీ తలమీది కెక్కి కూర్చున్నట్టనిపించి, కృంగిపోయాడు స్టేషన్ వేపు భారంగా అడుగులేస్తున్న సుబ్బరామయ్య.

